ప్రేమాత్మస్వరూపులారా!

ఈనాడు ప్రపంచము గొప్ప మేధావులచే, వితండవాదములు చేసే పండితులచే అనుభవజ్ఞులైన రాజకీయవాదులచే, కాషాయవస్త్ర ధారులైన సన్యాసులచే నిండియున్నది. ఈనాడు మానవత్వము లోపల దివ్యత్వము శూన్యమైంది. కేవలము వితండ వాదములేగాని, శల సానుభూతులు ఎక్కడా కనుపించటం లేదు. మానవత్వములోని దివ్యత్వాన్ని యీనాడు మరచిపోయినారు. ఈనాడు ప్రపంచములోని మానవులలో ప్రధానముగా వుండవలసినది మానవత్వమే.

ఎన్ని విద్యలను అభ్యసించినప్పటికిని, ఎన్ని పదవులను యేలినప్పటికిని, ఎంతటి వైజ్ఞానికుడైనప్పటికి మానవతా విలువలే లేకుండిన యితడు మానవుడనిపించుకోడు. మానవత్వాన్ని యీనాడు అభివృద్ధి చేసుకోటానికి ప్రయత్నించాలి. మానవత్వమనగా ఏమిటి? మనసు, మాట, క్రియ ఒక్కటైన అదియే మానవత్వము. మనసు వేరు, క్రియ వేరు, మాట వేరు అయినప్పుడు యిది మానవత్వానికి విరుద్ధమైన దానవత్వముగా మారుతుంది. త్రికరణ శుద్ధితో కూడిన తత్వాన్ని మనము అనుభవించాలి. మానవుడని పేరు పెట్టుకొని మానవత్వానికే వ్యతిరేకముగా ప్రవర్తించటము మానవత్వమునకే అపకీర్తి. విత్తనము భూమిలో పెట్టినప్పుడే వృక్షమై ఫలపుష్పాలను అందిస్తుంది. దానినే బండలో పెట్టినప్పుడు అది అభివృద్ధి కాదు. మానవత్వమన్నది కేవలము ఆధ్యాత్మిక హృదయమునందు మాత్రమే అభివృద్ధి కాగలదుగాని అందరి హృదయములందు అభివృద్ధి కానేరదు. కనుకనే యీనాడు మానవత్వమన్నది అభివృద్ధి కావాలంటే జీవితములో వివిధ పరిధుల మధ్య సానుభూతి సమన్వయములు అభివృద్ధి చేసుకోవాలి.

ప్రేమస్వరూపులారా! మనము మానవులము. ఈ మానవత్వములోని దివ్యత్వము యేమిటని మనము విచారించుకున్నప్పుడు మానవత్వము కేవలము నాటకము బూటకములలో కూడినది కాదని తెలుసుకోవాలి. మానవత్వము ప్రజ్ఞాన విజ్ఞాన, సుజ్ఞానములతో కూడుకొన్నటువంటిది. ఈనాడు అర్థములేని ఆవేదనలచే, అంతులేని ఆశలచే, అప్రాప్య ప్రాప్తికై ప్రాకులాడుతూ అశాంతికి గురైపోతున్నాము. ఇట్టి అజ్ఞాన అశాంతులలో వున్న మానవునకు చక్కని దిక్కును చూపే జ్యోతే ఆధ్యాత్మిక జ్యోతి. ఈనాడు విసుగు ఎక్కువ. చిరాకు ఎక్కువ. ఉపన్యాసమును వినే శ్రద్ధాభక్తులు కూడా ప్రజలలో లేకున్నవి. కారణము ఏమిటి? ఆకార మానవత్వము చేత లోకానికి యేమాత్రము వుపయోగము లేదు. ఈనాడు ప్రచార ప్రబోధలు మాత్రము చేస్తున్నారు. గాని ఆచార విచారములు శూన్యమైపోయాయి. ఈనాడు ఎవరికైనా ఆచారము అత్యవసరము. ప్రపంచ అభివృద్ధికి

624038902

కావలసినది షేక్స్పియర్లో యిన్స్టైన్లో కాదు. సద్గుణవంతులైన విద్యార్థులు, విద్యార్థినులు. స్త్రీ పురుషులు అత్యవసరము. అప్పుడే దేశము అభివృద్ధి కాగలుగుతుంది. మనము మానవత్వము యొక్క అంతర్ దృష్టిని కోల్పోయినాము. మానవత్వములో దివ్యత్వము యెంతో విశాలముగా వుంటుంది. అనంతములో అనంతముగను, సూక్ష్మములో సూక్ష్మముగాను వున్నవాడే భగవంతుడు. కనుకనే అణోరణీయాన్ మహతో మహీయాన్ అనుభజ్ఞుడు అనే పదమును మనము ప్రయోగపెడుతున్నాము. వ్యాపారములో యితడు అనుభవజ్ఞుడని అంటుంటాము. వైద్యములో అనుభవజ్ఞుడు అంటుంటాము. కానీ అనుభవజ్ఞుడనగా భగవంతుడే అని అర్థము. అను అనగా చాలా చిన్నది. మన హృదయములో చాలా చిన్నదిగా కనుపించకుండా వున్న భగవంతుడే అనుభవజ్ఞుడు. ఇలాంటి పవిత్రమైన అర్థాన్ని మనము యీనాడు విస్మరించినాము. బాహ్యమైన అర్థములతో మనము భ్రాంతి పొందుతున్నాము. తన తత్వాన్ని తాను మరచిపోయి, తన శక్తిసామర్థ్యములు తాను మరచిపోయి తిండి తీర్థాదుల కోసమై పాటుపడుతున్నాడు.

ఈనాటి మానవుడు తన కోర్కెలు పెరిగే కొలది ఆనందము తగ్గునన్న విషయము తాను గుర్తించుకోటంలేదు. చీమల పుట్టవలె కోరికలు పుడుతూ పుడుతూ వస్తున్నాయి. ఎంత తిని నప్పటికిని తృప్తి లేదు. ఎంత అనుభవించినప్పటికి తృప్తిలేదు. పశు పక్ష్యాదులు తిని తృప్తి పడుతున్నాయి. వాటికి దాచుకునే స్వార్థముగాని, దోచుకునే పాపముగాని లేవు. కాని మానవుడే దాచుకొనే స్వార్థమునకు దాచుకొనే పాపమునకు గురి అయిపోతున్నాడు.

దివ్యమైన మానవత్వాన్ని యీనాడు మనము అభివృద్ధిగావించుకోవాలి. ఈ దివ్యత్వాన్ని మనము ఎక్కడనుండో కొని తెసుకు రానక్కరలేదు. అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణస్థితః. ఆ దివ్యత్వము మనలోనే వుంటున్నది. మనకంటె మించినది లోకములో మరొక్కటి లేదు. ప్రతి మానవుడు కూడా భగవత్స్వరూపమే. ఇన్ని తలలతోయిన్ని చేతులతో వున్న భగవంతుడే విరాటు స్వరూపము. అందరు భగవత్స్వరూపులే.

భగవంతుడు ప్రేమమయుడు. ఆ ప్రేమనుండి ఆవిర్భవించిన చిదానంద స్వరూపుడే మానవుడు. ప్రతి మానవుని యందు ప్రేమ లేకపోలేదు. ఆ ప్రేమను మానవుడు యీనాడు బాహ్యప్రపంచమునందు ప్రసరింపచేయుటము చేతనే తన నిజ స్వరూపాన్ని తాను మరచిపోతున్నాడు. కనుక భగవత్ప్రేమను సంకుచితమైన రీతిగా వుపయోగపెట్టకుండా సమత్వమైన ఆత్మతత్వములో అందరికి అందించటానికి మనము ప్రయత్నించాలి. ఆ ప్రేమలోనే మన జీవితమంతా సార్థకము గావించుకోవాలి. ప్రేమకంటె మించినది మరొకటి లేదు. ఈ ప్రేమను యీనాడు మనము కోల్పోయినాము. తల్లి బిడ్డలకు ప్రేమ లేదు. భార్యాభర్తలకు ప్రేమలేదు. స్నేహితుల మధ్య ప్రేమ లేదు. హల్లో! గుడ్‌బై అని చెప్పటము మాత్రమేనా ప్రేమ. భావానికి భావము

624038903

హృదయానికి హృదయము యేకము కావాలి. సమత్వముతో కూడిన మమత్వము పెంచుకోవాలి. భిన్నత్వముతో కూడిన మమత్వము సంకుచిత మార్గములో ప్రయాణము చేస్తుంది. కనుక మనము సంకుచితమైన భావాలను త్రుంచివేసి విశాలమైన భావములను పెంచుకొని అందరియందు వున్న భగవంతుడు ఒక్కడే అని తెలుసుకోవాలి. ఏకోవశీ సర్వభూతాంతరాత్మ. నీయందు నాయందు వున్నది ఒకడే అదే దైవత్వము.

భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము ఎక్కడ వుంటున్నాయి. ఇవి ప్రపంచములో వుంటున్నాయి. ఈ పంచభూతముల స్వరూపమే ప్రపంచము. ఈ పంచభూతములతో కూడినటువంటిదే ప్రపంచము. మనమే ప్రపంచము. పంచభూతములు ఒకదానికంటె మరొకటి తేలికగా వుంటుంది. వీటికన్నిటికి అధిపత్యము వహించిన తత్వమే ఆత్మతత్వము. భూమికంటె అతి సూక్ష్మమైనది జలము ఇది సూక్ష్మమే కాకుండా అతి విశాలమైనది. ఈ జలముకంటె అగ్ని మరింత సూక్ష్మమైనది. అది మరింత విశాలముగా వుంటుంది. అగ్నికంటె వాయువు మరింత విశాలమైనది; సూక్ష్మమైనది. మరి వాయువుకంటె విశాలమైనది సూక్ష్మమైనది ఆకాశము. కాని ఆత్మ ఆకాశముకంటె మరింత సూక్ష్మమైనది విశాలమైనది.

ఈనాడు మానవులకు కావలసినది కృతజ్ఞత. ఈ కృతజ్ఞత లేకపోతే మానవుడు జీవించలేడు. సుఖమును ఆనందమును అనుభవించలేడు. తల్లి, తండ్రి గురువు, దైవము వీరికి కృతజ్ఞత తెలియజేయమంటారు. ఎందుకు యీ పదములను యీ వరుసలో ప్రయోగపెడుతుంటారు. తల్లి, గురువు దైవము. తండ్రి అని ఎందుకు చెప్పకూడదు? ఈ వరుసగా వున్న పదముల అర్థమేమి? మనలను చిన్నప్పటినుండి రక్షించి, పోషించి, సంరక్షించి మలమూత్రాదులను శుభ్రపరచి, మనలను పెంచి పెద్ద చేయునది తల్లి. ఆ తల్లిని మొట్టమొదట మనము గౌరవించాలి. బిడ్డను ఆదర్శవంతునిగా తీర్చిదిద్దాలన్న అభిలాషతో సద్గురువు వద్దకు చేర్చుతాడు. ఈ సద్గురువు ఏమి చెయ్యాలి. ఇతను దైవాన్ని చూపించాలి. దైవాన్ని నిరూపించాలి. దైవత్వాన్ని బోధించాలి. ఇదే నిజమైనది. కనుక తల్లి తండ్రిని చూపించాలి. తండ్రి గురువును చూపించాలి. గురువు దైవాన్ని చూపించాలి. అందువలన వీరికి మనము కృతజ్ఞత తెలియజెయ్యాలి. కాని యీనాడు మనము ఆవిధముగా చేయుటము లేదు. మనము కన్న తల్లితండ్రులనే గౌరవించటం లేదు. తల్లితండ్రులనే ప్రేమించటం లేదు. ఏదో పాత్రలో వచ్చిన దానిని మనము ప్రేమిస్తున్నామంటే యిది [illegible] Love. యిది కృత్రిమమైన ప్రేమ.

దీనికి మంచి ఉదాహరణ మహాభారతములో వున్నది. కృష్ణుని సంరక్షణ వలన పాండవులంతా జీవించారు. గాంధారి నూరుగురు పుత్రులలో ఒక్క పుత్రుడైనా బ్రతుకలేదు. గాంధారి శోకములో కృశించింది. గాంధారి శోకమును చూడలేక

అనేకమంది కృష్ణుని నిందించారు. ఆమెకు శాంతి ప్రసాదించాలని కృష్ణుడు గాంధారి వద్దకు వచ్చాడు. కృష్ణుని చూచిన వెంటనే గాంధారి కోపముతో వుద్రేకపడింది. కృష్ణా! దైవమైన నీకింత భేదభావమా. నా కుమారులలో ఒక్కరినైనా బ్రతికించ లేకపోతివా. అని కృష్ణుని దూషించింది. అప్పుడు కృష్ణుడు చిరునవ్వుతో చెబుతాడు నీ దృష్టి ఒక్క కుమారుని పైననైనా ప్రసరించిందా? అని అడిగాడు. నీవే నీ కుమారులను చూడజాలవు. నీ దృష్టికి గురికాని నీ కుమారులు దైవదృష్టికి యే విధముగా గురికాగలరు? కనుక మొట్టమొదట మనము తల్లిని ప్రేమించాలి. తల్లి ప్రేమకు గురికావాలి. అప్పుడే నిజమైన దైవప్రేమకు గురి కాగలరు. మాతృదేవోభవ అని తల్లిని గౌరవించాలి. రామచంద్రుడు అదే చెప్పాడు. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి. నా తల్లియే నాకు స్వర్గము. తల్లికంటె మించిన స్వర్గము లేదని చెప్పాడు. అలాంటప్పుడు మనము దేనిని పాటిస్తున్నాము. మన భారతీయ సంస్కృతిని మనము యేమి గుర్తిస్తున్నాము. మనము యే మాత్రము గుర్తించటంలేదు. ఎన్ని సిద్ధాంతములు తెలుసుకున్నప్పటికిని, ఎన్ని వైజ్ఞానిక పరిశోధనలు సలిపినప్పటికిని, నీవు భౌతికముగా ఎన్ని సుఖములను అనుభవించినప్పటికిని నీవు మానవునిగా ఎన్ని అర్హతలు సంపాయించుకున్నావనేది ముఖ్యము. ఏమి లేదు. మాటలలో హీరో కాని చేతలలో జీరో. అయిపోయినావు. ఇది కాదు మానవత్వము. నిజముగా మానవుడు మానవుడుగా జీవించాలి. మానవ జీవిత పరమార్థము 'మానవ' అన్న పదములోనే వున్నది. మా-న-వ. మా అనగా అజ్ఞానము. న అనగా లేకుండా వ అనగా వర్తించటము. అనగా అజ్ఞానము లేకుండా వర్తించటము. వాడే మానవుడు. కానీ యీనాడు మన జీవితమంతా అజ్ఞానములోనే కృంగి పోతున్నది.

ఈనాడు మన జీవితము కుళ్ళి, కృశించి కంపు కొడుతున్నది. ఇది కాదు మానవత్వము. మనము బాహ్యరీతిలో పరిశుద్ధముగా వున్నంత మాత్రమున చాలదు. హృదయ పరిశుద్ధి కావాలి. చిత్తశుద్ధి కావాలి. మనము చేసే సర్వకర్మలు చిత్తశుద్ధికి ఆధారమైనవి. చిత్తస్య శుద్ధయే కర్మః. మనము ఎన్ని కర్మలు చేసి యేమి ప్రయోజనము? మనమంతా బండలుగానే వుంటున్నాము. జీవితములో ఎన్నో కష్టములు, నష్టములు ఎదురవుతుంటాయి. వీటి కన్నింటికిని తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగినవాడే నిజమైన మానవుడు. మనకు ఎదురుదెబ్బలు అదురుదెబ్బలు తగులుతుంటాయి కాని మనము చెదరకూడదు. సాధించటానికి తగిన కృషి చెయ్యాలి. ఈ సాధించటానికి తగిన బలము ఆత్మబలము వలనే వస్తుంది. ఏ బలము వున్నప్పటికి ఆత్మబలము లేకపోతే ప్రయోజనము లేదు. కర్ణునకు భుజబలము, అర్థబలము వున్నాయి. కాని దైవబలము లేకపోవటం వలన యుద్ధములో చిక్కుకొని పోయాడు. దైవబలము అత్యవసరము.

ప్రేమస్వరూపులారా! దైవము కానిది మరొకటి యీ జగత్తునందు లేదు. మీరు చూచేది సర్వము దైవమే. అనుభవించేది దైవము. ఆలకించేది దైవమే. ఆహారము అతనే. పానీయము అతనే. మన చుట్టూ వున్న గాలినే మనము చూడలేము. గాలిని పట్టి

6240 38905

కుంటున్నామేగాని చూడటంలేదు. గాలిని అనుభవిస్తున్నామేగాని పట్టుకొనటంలేదు. దైవము పట్టుకుంటే చిక్కేవాడు కాదు. కన్నులకు కనుపించేవాడు కాదు. హృదయానికి అనిపించేవాడు. మనసుకు తెలిసేటువంటివాడు. మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః. ఈ మనస్సే జగత్స్వరూపాన్ని ధరించింది. మనోమూలమిదం జగత్ మనస్సును మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. ఏమిటి యీ మనస్సు. మనస్సే మాధవత్వము

ఈ మనస్సును మనము సరియైన మార్గములో ప్రవేశపెట్టటానికి ప్రయత్నించాలి. అప్పుడే మనము సరియైన ఆనందాన్ని అందుకోగలము. మనస్సు పిచ్చికోతివలె సంచరిస్తుంది. అది సరియైన మానవత్వానికి గుర్తు కాదు. పశుపక్షిమృగాదులు కూడా ఆహార నిద్రా భయ మైథునాదులను అనుభవిస్తున్నాయి. మానవుడు కూడా వాటినే అనుభవిస్తుంటే జంతూనాం నరజన్మ దుర్లభం అనటంలోని అర్థమేమిటి? మానవుడు మానవుడుగా వుండి యితరులకు ఆదర్శమైన మానవుడిగా నిరూపించాలి. మనము అల్లరచిల్లరిగా ప్రవర్తించకుండా పవిత్రమైన మార్గములో ప్రవేశించాలి. మన జీవితము చాలా ఉత్తమమైనది. పవిత్రమైనది. ఇలాంటి మానవ జీవితాన్ని పవిత్రము గావించుకోవాలిగాని వ్యర్థము గావించుకోకూడదని తెలుసుకోవాలి.

ప్రేమ స్వరూపులారా! ఏ సాధన చేయకపోయినప్పటికిని ఏ జపధ్యానములు చేయకపోయినప్పటికిని ప్రేమ తత్వాన్ని పెంచుకోండి. ఆ ప్రేమ అనే భగవత్ప్రసాదాన్ని సర్వులకు పంచిపెట్టండి. ఆ ప్రేమకంటె మించినది మరొకటి లేదు. ఈ ప్రేమ ద్వారానే ప్రపంచమంతా ఒక్కటైపోతుంది. ప్రేమ లేకపోవటం వలనే యింటిలో గొడవలు బయలుదేరుతున్నాయి. కారణమేమిటి? ప్రేమ లేకపోవటం వలనే. ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. Love is God. Live in Love యిదే ప్రధాన లక్ష్యముగా తీసుకోవాలి. ఎవరి దగ్గరకు పోయినప్పటికి వినయ విధేయతలను ప్రకటించాలి. ఈ నాడు సత్య ధర్మ శాంతి ప్రేమలు గురించి ప్రచారము ప్రబోధలు జరుగుతున్నాయి. ప్రదర్శనలు జరుగుతున్నాయి. కాని ఆదర్శముగా నిరూపించటంలేదు. దానిని ఆచరించి అనుభవించాలి. మనము ప్రకటించటం వలనగాని ప్రదర్శించటం వలనగాని ప్రయోజనం లేదు. దానివలన లోకము యేనాడూ మారదు. ఏనాడు మనము ఆచరణలో ప్రదర్శిస్తామో అప్పుడే నిజమైన ఆదర్శవంతమవుతుంది.

నిజముగా మానవుడు ఆదర్శప్రాయుడు. ఆదర్శాన్ని నిరూపించటానికి ఒక్క మానవత్వమే సరియైన ఆదర్శము. ఈ జగత్తులో మానవత్వాన్ని మించినది మరొకటి లేదు. ఈ నాటి అశాంతి అల్లకల్లోలములకు కారణము ఏమిటి? చెప్పటం ఒకటి చేయటం మరొకటి. యిదే కారణం. అందువలనే మానవత్వాన్ని కోల్పోతున్నాము. తలచినదే చెప్పు. చెప్పినదే చేయి. ఈ మూడింటి యొక్క యేకత్వము వలననే మానవత్వము అభివృద్ధి అవుతుంది. ఇదే మీరు గుర్తించవలసినది. ఆధ్యా

త్మికమనగా ఏకాకి జీవితమని గాని, వంటరితనమనిగాని భావించకూడదు. మానవత్వమ్మంతా ఒకటిగా చేసి దానిని ఆచరించి అనుభవించి ఆనందించి పరులకు అందింప చేయటమే ఆధ్యాత్మికము. అంతేగాని భజనలు చేయటం కాదు. పూజలు చేయటం కాదు. ఇవి సత్కర్మలే. అందరిని ప్రేమించటమే భక్తి. అందరి యందు దైవమున్నదన్న విశ్వాసాన్ని పెంచుకోవాలి. సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. ఎవరికి నమస్కారము చేసినా కేశవునకు నమస్కారము చేసినట్లుగా భావించాలి. సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. ఎవరినీ తిరస్కరించినా కేశవుని తిరస్కరించినట్లుగా భావించాలి. ఇటువంటి భావము వచ్చినప్పుడే మానవత్వము దివ్యత్వముగా రూపొందుతుంది.

ప్రేమస్వరూపులారా! కేవలము ఉపన్యాసములచే హృదయములను కదిలించలేరు, కరిగించలేరు. ఉపన్యాసములతో అశాంతి కలుగుతుంది. మనసు వేడెక్కుతుంది. హృదయం కలతచెందుతుంది. సందేహములలో కూరుకుంటుంది. ఈ ఉపన్యాసములకంటె ఆచరణాయందు అందరియందున్న ప్రేమ తత్వము దైవత్వము ఒకటేయని గుర్తించుకొని ఆ మార్గాన్ని అనుసరించటమే చాలా ఉత్తమమైన మార్గమని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.